మేటి సంస్థల్లో మ్యాథ్స్, సైన్స్

కోర్సులు ఎన్ని ఉన్నప్పటికీ విస్తృత అవకాశాలు అందించడంలో మ్యాథ్స్, సైన్స్‌లే ముందుంటున్నాయి. వీటిని సుప్రసిద్ధ సంస్థల్లో చదివినవారు అత్యున్నత స్థాయిలో రాణించగలరు. ఈ సబ్జెక్టుల్లో కెరియర్‌ను ఆశిస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థులు నేషనల్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (నెస్ట్)కు ప్రాధాన్యం ఇస్తే ఉజ్వల భవిష్యత్తుకు ఆస్కారం ఉంటుంది. ఇటీవలే నెస్ట్-2024 ప్రకటన వెలువడింది!

ఈ పరీక్షలో ప్రతిభ చూపినవారు.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (నైసర్), భువనేశ్వర్; యూనివర్సిటీ ఆఫ్ ముంబయి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ విభాగానికి చెందిన సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్ (సీఈబీఎస్)ల్లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులు చదువుకోవచ్చు. ఈ సంస్థల్లో చేరినవారికి నెలకు రూ.5000 చొప్పున ఐదేళ్లపాటు ఉపకార వేతనం అందుతుంది.

మ్యాథ్స్, సైన్స్ కోర్సుల్లో మెరికల్లాంటి విద్యార్థులను గుర్తించి, వాళ్లను పరిశోధనల దిశగా ప్రోత్సహించాలనే లక్ష్యంతో నెస్ట్‌ను ఏటా నిర్వహిస్తున్నారు. బోధన, పరిశోధనల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న ఫ్యాకల్టీ, అధునాతన ల్యాబ్ సౌకర్యాలు, ఉన్నత ప్రమాణాలు.. నైసర్, సీఈబీఎస్‌ల ప్రత్యేకత. ఎంతో పేరున్న శాస్త్రవేత్తలతోనూ తరగతులు నిర్వహిస్తారు. ఈ సంస్థల్లో బయాలజీ, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో కోర్సులు అందిస్తున్నారు. నైసర్‌లో 200, సీఈబీఎస్‌లో 57 సీట్లు ఉన్నాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డీఏఈ) నుంచి దిశ ప్రోగ్రాంలో భాగంగా ఈ సంస్థల్లో చేరిన విద్యార్థులకు ప్రతి నెలా రూ.5000 స్టైపెండ్ అందుతుంది. అలాగే వేసవిలో ప్రాజెక్టు కోసం ఏడాదికి రూ. 20,000 చొప్పున కాంటింజెన్సీ చెల్లిస్తారు.

అన్ని సెమిస్టర్లలోనూ మేటి ప్రతిభ చూపిన విద్యార్థులు భాభా అటామిక్ రిసెర్చ్ సెంటర్ (భార్క్) ట్రెయినింగ్ స్కూల్‌లో పరీక్ష రాయకుండా, నేరుగా ఇంటర్వ్యూలో పాల్గొనవచ్చు. ఇందులో మెరిసినవారు శిక్షణ తర్వాత భార్క్‌లో సైంటిఫిక్ ఆఫీసర్ హోదాలో విధులు నిర్వర్తించవచ్చు. నైసర్‌లో ఎమ్మెస్సీ పూర్తిచేసుకున్నవారికి హోమీ భాభా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ (హెచ్‌బీఎన్ఐ) డిగ్రీలను ప్రదానం చేస్తుంది. సీఈబీఎస్‌లో చదివినవారికి ముంబై యూనివర్సిటీ వీటిని అందిస్తుంది. ఈ రెండింటిలో కోర్సులు పూర్తిచేసుకున్నవారు దేశం, విదేశాల్లో పేరున్న సంస్థల్లో పీహెచ్‌డీలో చేరుతున్నారు. జాతీయ సంస్థల్లో ఫ్యాకల్టీ, కార్పొరేట్ సెక్టార్‌లో మేటి ఉద్యోగాలు వీరికి దక్కుతున్నాయి.

ప్రశ్నపత్రం

పరీక్షను ఆన్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. వ్యవధి మూడున్నర గంటలు. ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటాయి. వీటిని 4 సెక్షన్ల నుంచి అడుగుతారు. అభ్యర్థికి ఆ సబ్జెక్టుల్లో ఉన్న పరిజ్ఞానం, విశ్లేషణ సామర్థ్యాన్ని తెలుసుకునేలా వీటిని రూపొందిస్తారు. సెక్షన్ల వారీ కనీస మార్కులు పొందడం తప్పనిసరి. సెక్షన్ 1 నుంచి 4 వరకు బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ప్రశ్నలు వస్తాయి. ఒక్కో సెక్షన్‌కూ 60 మార్కులు కేటాయించారు. ఒక్కో విభాగంలో 20 ప్రశ్నలు వస్తాయి. సరైన సమాధానం గుర్తిస్తే 3 మార్కులు. తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. అభ్యర్థులు 4 సెక్షన్లలో ఎక్కువ మార్కులు సాధించిన మూడు సెక్షన్ల స్కోరుతో మెరిట్ లిస్టు తయారుచేస్తారు. దీని ప్రకారం మొత్తం 180 మార్కుల్లో అభ్యర్థులు సాధించిన స్కోరు పర్సంటైల్ విధానంలో లెక్కిస్తారు. జనరల్ అభ్యర్థులు 95, ఓబీసీలు 90, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 75 పర్సంటైల్ సాధించాలి. ఇలా అర్హుల జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం విద్యార్థులను కోర్సుల్లోకి తీసుకుంటారు.

ముఖ్య వివరాలు

అర్హత: సైన్స్ గ్రూపులతో 2022, 2023లో ఇంటర్ ఉత్తీర్ణులు, ఈ ఏడాది ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే 55 శాతం ఉండాలి. వయసు నిబంధన లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తులు: మే 31 వరకు స్వీకరిస్తారు.
ఫీజు: జనరల్, ఓబీసీ పురుషులైతే రూ.1400. అన్ని వర్గాల మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.700.
అడ్మిట్ కార్డులు: జూన్ 15 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
పరీక్ష తేదీ: జూన్ 30 (రెండు సెషన్లలో ఉదయం, మధ్యాహ్నం)
ఫలితాలు: జులై 10న ప్రకటిస్తారు.
పరీక్ష కేంద్రాలు: తెలంగాణ.. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్. ఏపీ.. గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరం తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం. (విద్యార్థులు వారి ప్రాధాన్యం ప్రకారం ఐదు కేంద్రాలు ఎంచుకోవాలి. పరీక్ష కేంద్రానికి 90 నిమిషాల ముందు చేరుకోవాలి)
వెబ్‌సైట్: https://www.nestexam.in/

సన్నద్ధత

సబ్జెక్టులవారీ సిలబస్ వివరాలు నెస్ట్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అందులో పేర్కొన్న చాప్టర్లు, అంశాలను గమనించి, అధ్యయనంలో వాటిపైనే దృష్టి సారించాలి.

- సీబీఎస్ఈ 11, 12 తరగతుల్లోని బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథ్స్ అంశాల నుంచే ప్రశ్నలొస్తాయి. అందువల్ల పాఠ్యపుస్తకాలు బాగా చదవాలి.
- కొన్ని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించడానికి హైస్కూల్ స్థాయి పరిజ్ఞానమూ అవసరం కావచ్చు. అందువల్ల 8, 9, 10 తరగతుల మ్యాథ్స్, సైన్స్ పుస్తకాల్లోని ముఖ్యాంశాలూ అధ్యయనం చేయాలి.
- ప్రాథమికాంశాలు, భావనలపై పట్టు సాధించాలి. వాటిలో ముఖ్యమైనవి రివిజన్ కోసం నోట్సు రాసుకోవాలి.
- ఏవైనా 3 సెక్షన్లకు సరైన జవాబులు గుర్తిస్తే సరిపోతుంది కాబట్టి బయాలజీ విద్యార్థులు మ్యాథ్స్‌ను, మ్యాథ్స్ విద్యార్థులు బయాలజీని చదవనవసరం లేదు.
- పాత ప్రశ్నపత్రాలను అధ్యయనం చేయాలి.
- నెస్ట్ వెబ్‌సైట్‌లో 2007 నుంచి 2023 వరకు నిర్వహించిన పరీక్షల ప్రశ్నపత్రాలు, సమాధానాలు అందుబాటులో ఉంచారు. అవన్నీ సాధన చేయడంతోపాటు, ప్రశ్నలు ఏ స్థాయిలో అడుగుతున్నారో గమనించాలి. సబ్జెక్టులవారీ ఏ చాప్టర్ల నుంచి ఏ తరహా ప్రశ్నలు, ఎన్నేసి వస్తున్నాయో తెలుసుకుని, అందుకు తగ్గట్టుగా సన్నద్ధం కావాలి.
- ఎంసెట్, ఐఐటీ-జేఈఈ, నీట్ పాత ప్రశ్నపత్రాలు, మోడల్ పేపర్ల సాధన ఉపయోగకరం.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు మోడల్ టెస్టులు రాసుకోవచ్చు. పరీక్షకు కొద్దిరోజుల ముందు మాక్ టెస్టు నెస్ట్ సైట్‌లో ఉంచుతారు. దాన్ని రాయాలి.

తాజా మార్పు

ఈసారి పరీక్ష విధానం మారింది.

1. గతంలో సింగిల్ ఆన్సర్, మల్టిపుల్ ఆన్సర్ ప్రశ్నలు వచ్చేవి. తాజాగా ప్రశ్నలన్నీ సింగిల్ ఆన్సర్‌వే అడుగుతారు.
2. గతంలో సబ్జెక్టుకు 50 మార్కులు. ఇప్పుడు వాటిని 60కి పెంచారు.
3. సబ్జెక్టుల వారీగా ఇచ్చే ప్రశ్నల సంఖ్య 17 నుంచి 20కి పెరిగింది.

గేమింగ్ కోర్సుల్లో చేరాలంటే...

మా అబ్బాయి ఇంటర్ (ఎంపీసీ) రెండో ఏడాది పరీక్షలు రాశాడు. ఎంసెట్ రాసే ఆలోచన లేదు. వీడియో గేమ్స్ అంటే చాలా ఇష్టం. వీడియో గేమ్స్ లేదా యానిమేషన్ సంబంధిత కోర్సులు ఎక్కడ ఉన్నాయి? - శ్రీలక్ష్మి

■ వీడియో గేమ్స్ అంటే ఇష్టం వేరు, వాటికి సంబంధించిన కోర్సులు చదవడం వేరు. చాలా సందర్భాల్లో ఒక వయసు వచ్చాక పిల్లల్లో వీడియో గేమ్స్ మీద ఆసక్తి తగ్గి, అందుకు సంబంధించిన కోర్సులపై ఇష్టం తగ్గే ప్రమాదం ఉంది. మీ అబ్బాయిని వీడియో గేమ్స్/ యానిమేషన్ లాంటి కోర్సుల్లో చేర్పించేముందు, ఆ రంగంలో రాణించాలంటే ఎంత ఓపిక ఉండాలో, ఎన్ని సవాళ్లు ఎదుర్కోవాలో, ఎలాంటి నైపుణ్యాలు అవసరమో చెప్పే ప్రయత్నం చేయండి. యానిమేషన్ రంగంలో ప్రవేశించాలంటే డ్రాయింగ్‌పై ఆసక్తి, టెక్నాలజీపై కొంత అవగాహన, సృజనాత్మకత అవసరం. ఇలాంటి కోర్సుల్లో డ్రాయింగ్, విజువల్ ఎఫెక్ట్స్, వీడియో గేమ్‌లను ఎలా తయారుచేయాలో నేర్పుతారు. యానిమేషన్‌కు సంబంధించిన ప్రోగ్రాంలను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్- అహ్మదాబాద్, ఐడీసీ స్కూల్ ఆఫ్ డిజైన్ ఐఐటీ- బాంబే, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ ఫైన్ ఆర్ట్స్- కోల్‌కతా, వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమిటీ యూనివర్సిటీ, పీఏ ఇనాందార్ కాలేజ్ విజువల్ ఎఫెక్ట్స్, డిజైన్ అండ్ ఆర్ట్- పుణె, ఇండియన్ ఇన్‌స్టిస్టూట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ యానిమేషన్- బెంగళూరు, ఆసియన్ అకాడెమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్- నోయిడా, ఎంఐటీ యూనివర్సిటీ ఆఫ్ డిజైన్- పుణె, సెయింట్ జేవియర్ కాలేజ్- కోల్‌కతా అందిస్తున్నాయి. వీడియో గేమింగ్‌కు సంబంధించిన కోర్సులు చాలా ప్రైవేటు సంస్థల్లో అందుబాటులో ఉన్నాయి. సంస్థల విశ్వసనీయత పూర్తిగా తెలుసుకుని మంచి శిక్షణ సంస్థను ఎంచుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

బీఎస్ఎఫ్‌లో ఎయిర్ వింగ్ పోస్టులు

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ఎయిర్ వింగ్ గ్రూప్- 'సి' (నాన్ గెజిటెడ్ నాన్ మినిస్టీరియల్) 22 పోస్టుల భర్తీకి పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
అసిస్టెంట్ ఎయిర్‌క్రాఫ్ట్ మెకానిక్ (ఏఎస్ఐ): 08
అసిస్టెంట్ రేడియో మెకానిక్ (ఏఎస్ఐ): 11
కానిస్టేబుల్ (స్టోర్‌మెన్): 03
ట్రేడ్స్: మెకానికల్, ఏవియానిక్స్.
అర్హత: పదో తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమాతో పాటు పని అనుభవం. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి.
వయసు: ఏఎఎం/ ఏఆర్ఎం ఖాళీలకు 28 ఏళ్లు మించకూడదు. కానిస్టేబుల్ పోస్టులకు 20 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి.
వేతనం: నెలకు ఏఎఎం/ ఏఆర్ఎం ఖాళీలకు రూ.29,200-92,300; కానిస్టేబుల్ పోస్టులకు రూ.21,700-69,100 చెల్లిస్తారు.
ఎంపిక: రాత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: రూ.147.20 (ఎస్సీ, ఎస్టీ, మహిళ, ఈఎస్ఎం అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది).
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15-04-2024.
వెబ్‌సైట్: https://rectt.bsf.gov.in/

రాయ్‌పుర్ ఎయిమ్స్‌లో ఫ్యాకల్టీ

రాయ్‌పుర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్.. శాశ్వత ప్రాతిపదికన 129 బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ/ దివ్యాంగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
1. ప్రొఫెసర్ 2. అడిషనల్ ప్రొఫెసర్
3. అసోసియేట్ ప్రొఫెసర్ 4. అసిస్టెంట్ ప్రొఫెసర్
విభాగాలు: అనస్తీషియాలజీ, అనాటమీ, బయోకెమిస్ట్రీ, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, క్లినికల్ హెమటాలజీ, డెర్మటాలజీ, ఎండోక్రైనాలజీ అండ్ మెటబాలిజం, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ తదితరాలు.
అర్హతలు: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో మెడికల్ పీజీ, ఎండీ, ఎంఎస్, ఎంసీహెచ్, డీఎం, డాక్టరేట్ డిగ్రీతో పాటు బోధన/ పరిశోధనానుభవం.
వయసు: ప్రొఫెసర్/ అడిషనల్ ప్రొఫెసర్ పోస్టుకు 58 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్/ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 50 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: విద్యార్హతలు, అనుభవం, ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ల తనిఖీ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్‌సర్వీస్‌మెన్‌లకు ఫీజు లేదు. మిగతావారందరికీ రూ.3000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 21-04-2024.
వెబ్‌సైట్: https://www.aiimsraipur.edu.in/user/vacancies.php

ప్రవేశాలు

ఏయూ ఇంజినీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్

విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం సెల్ఫ్ సపోర్ట్ విధానంలో వివిధ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏయూ ఇంజినీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ (ఆఈఎట్ 2024) ప్రకటన విడుదలైంది.

బ్రాంచీలవారీగా సీట్ల వివరాలు-
బీటెక్– సీఎస్ఈ: 360
బీటెక్– ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్: 60
బీటెక్– మెకానికల్ ఇంజినీరింగ్: 30
బీటెక్– సివిల్ ఇంజినీరింగ్: 30
బీటెక్– ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్: 30
అర్హత: కనీసం 45% మార్కులతో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో 10+2 (రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు 40% ఉంటే చాలు).
సీట్ల కేటాయింపు: ప్రవేశ పరీక్ష ఆధారంగా.
పరీక్ష కేంద్రాలు: విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడప.
దరఖాస్తు రుసుము: రూ.1,200 (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు రూ.1000).
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 24-04-2024.
రూ.750 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: 01-05-2024.
హాల్ టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభం: 03-05-2024.
ప్రవేశ పరీక్ష తేదీ: 05-05-2024.
ఫలితాల విడుదల: 07-05-2024.
వెబ్‌సైట్: https://audoa.andhrauniversity.edu.in/default1.aspx?CET=EET

స్పీచ్, హియరింగ్ థెరపీలో దివ్యమైన శిక్షణ

స్పీచ్, హియరింగ్ కోర్సుల్లో చేరినవారికి ప్రతినెలా స్టైపెండ్ అందుతుంది. వీటిని పూర్తిచేసుకున్నవారికి ఎన్‌జీవోలు, ప్రత్యేక సేవల కేంద్రాలు, స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్లు, ఆసుపత్రులు, విద్యా సంస్థల్లో ఎక్కువ ఉద్యోగాలు ఉంటాయి. సొంతంగానూ రాణించవచ్చు.

చెప్పాలని ప్రయత్నిస్తారు.. కానీ సాధ్యం కాదు. తెలుసుకోవాలనుకున్నప్పటికీ వినిపించదు.. ఇప్పుడీ సమస్యతో చిన్నారులతో సహా ఎక్కువమందే ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటివారికి స్పీచ్, హియరింగ్ థెరపీ ఎంతో అవసరం. ఈ విభాగాల్లో శిక్షణ అందించడానికి జాతీయ స్థాయిలో ఏర్పాటైనదే- ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ (ఏఐఐఎస్‌హెచ్). ఈ సంస్థ డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయుల్లో వివిధ కోర్సులు అందిస్తోంది. వాటిలో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది!

ఏఐఐఎస్‌హెచ్‌ని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 1966లో మైసూర్‌లో ఏర్పాటుచేశారు. చెవుడు, మూగ సమస్యలతో బాధపడుతున్నవారికి నాణ్యమైన విద్య, సేవలు అందించడానికి నిపుణులను రూపొందించే లక్ష్యంతో ఈ సంస్థ పనిచేస్తోంది. ఇక్కడ లభిస్తోన్న కోర్సులకు పరీక్షలో చూపిన ప్రతిభతో అవకాశం కల్పిస్తారు. వీటిలో చేరినవారికి ప్రతినెలా స్టైపెండ్ అందుతుంది. స్పీచ్, హియరింగ్ చదువులు పూర్తిచేసుకున్నవారు మేటి ఉపాధిని సొంతం చేసుకోవచ్చు. వీరికి ఎన్‌జీవోలు, ప్రత్యేక సేవల కేంద్రాలు, స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్లు, ఆసుపత్రులు, విద్యా సంస్థల్లో ఎక్కువ ఉద్యోగాలు ఉంటాయి. సొంతంగానూ రాణించవచ్చు. సెషన్/సమయాలవారీ సేవా వేతనం పొందవచ్చు. నగరాలు, పట్టణాల్లో ఈ విభాగాల్లో నిపుణుల కొరత ఉంది. అందువల్ల ఆసక్తి ఉన్నవారు కోర్సులు పూర్తిచేసుకున్నవెంటనే సులువుగానే ఉపాధి పొందవచ్చు.

డిప్లొమాలు

హియరింగ్ ఎయిడ్ అండ్ హియర్ మోల్డ్ టెక్నాలజీ
సీట్లు: 30
అర్హత: ఫిజిక్స్‌తో ఇంటర్ లేదా ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌ల్లో డిప్లొమా/ఐటీఐ లేదా డెంటల్ టెక్నీషియన్ కోర్సు పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులు సంబంధిత అర్హత పరీక్షలో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. వయసు 24 ఏళ్లలోపు ఉండాలి.
ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్
సీట్లు: 30
అర్హత: ఏదైనా గ్రూపుతో ఇంటర్మీడియట్‌లో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. వయసు 17 ఏళ్లు ఉండాలి.
హియరింగ్, లాంగ్వేజ్ అండ్ స్పీచ్
సీట్లు: ఈ కోర్సును ఏఐఐఎస్‌హెచ్‌తోపాటు 8 అనుబంధ సంస్థల్లో నిర్వహిస్తున్నారు. ఏఐఐఎస్‌హెచ్‌లో 30 ఇతర చోట్ల 28 చొప్పున ఉన్నాయి.
అర్హత: ఇంటర్‌లో ఎంపీసీ లేదా బైపీసీ గ్రూపుతో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. వయసు జులై 1 నాటికి 21 ఏళ్లలోపు ఉండాలి.
పై కోర్సుల వ్యవధి ఏడాది. వీటిలో చేరినవారికి నెలకు రూ.250 చొప్పున పది నెలల పాటు స్టైపెండ్ చెల్లిస్తారు.

బ్యాచిలర్ డిగ్రీలు

బ్యాచిలర్ ఆఫ్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ (బీఏఎస్ఎల్‌పీ)
సీట్లు: 80
అర్హత: ఇంటర్‌లో ఎంపీసీ లేదా బైపీసీ గ్రూపుతో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఈ కోర్సులోకి ఎంపికైనవారికి మొదటి మూడేళ్లు సంవత్సరానికి 10 నెలల పాటు నెలకు రూ.800 చొప్పున స్టైపెండ్ చెల్లిస్తారు. నాలుగో ఏడాది ఇంటర్న్‌షిప్‌లో భాగంగా నెలకు రూ.5000 అందిస్తారు.
స్పెషల్ బీఎడ్ (హియరింగ్)
సీట్లు: 20
అర్హత: ఏదైనా డిగ్రీలో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత. అలాగే అభ్యర్థి వయసు జులై 1 నాటికి 30 ఏళ్ల లోపు ఉండాలి. కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో చేరినవారికి నెలకు రూ.400 చొప్పున ఏటా పది నెలల పాటు స్టైపెండ్ అందుతుంది.

మాస్టర్ డిగ్రీలు

ఎమ్మెస్సీ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ
అర్హత: బీఎస్సీ (స్పీచ్ అండ్ హియరింగ్) / బీఏఎస్ఎల్‌పీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
సీట్లు: 44
కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎంపికైనవారికి నెలకు రూ.1300 చొప్పున ఏడాదిలో పది నెలల పాటు రెండేళ్లు చెల్లిస్తారు.
ఎమ్మెస్సీ ఆడియాలజీ
అర్హత: బీఎస్సీ (స్పీచ్ అండ్ హియరింగ్) / బీఏఎస్ఎల్‌పీ
సీట్లు: 44
కోర్సు వ్యవధి రెండేళ్లు. చేరినవారికి నెలకు రూ.1300 చొప్పున ఏడాదిలో పది నెలల పాటు రెండేళ్లు స్టైపెండ్ చెల్లిస్తారు.
స్పెషల్ ఎంఎడ్ (హియరింగ్)
అర్హత: బీఎడ్ లేదా స్పెషల్ బీఎడ్‌లో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత. అభ్యర్థుల వయసు జులై 1 నాటికి 35 ఏళ్లలోపు ఉండాలి.
సీట్లు: 20
కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎంపికైనవారికి నెలకు రూ.650 చొప్పున ఏడాదిలో పది నెలల పాటు రెండేళ్లు చెల్లిస్తారు.
ఈ సంస్థ ఆడిటరీ వెర్బల్ థెరపీలో ఏడాది వ్యవధితో పీజీ డిప్లొమా కోర్సు అందిస్తోంది. 12 సీట్లు ఉన్నాయి.

పీహెచ్‌డీలు

స్పీచ్- లాంగ్వేజ్ పాథాలజీ, ఆడియాలజీ, స్పీచ్ అండ్ హియరింగ్, స్పెషల్ ఎడ్యుకేషన్, లింగ్విస్టిక్స్ అంశాల్లో పీహెచ్‌డీ కోర్సులు ఉన్నాయి.
సంబంధిత విభాగాల్లో 55 శాతం మార్కులతో పీజీ పూర్తిచేసినవారు వీటికి అర్హులు.
ఎంపికైనవారికి మొదటి ఏడాది నెలకు రూ.20,000 రెండో ఏడాది నెలకు రూ.22,000 మూడో సంవత్సరం నెలకు రూ.25,000 చొప్పున స్టైపెండ్ అందిస్తారు. పోస్టు డాక్టోరల్ ఫెలోషిప్‌లో భాగంగా ప్రతి నెలా రూ.35,000 అందిస్తారు. పీహెచ్‌డీ వ్యవధి మొత్తం హెచ్ఆర్ఏ ఉంటుంది. ఏటా కాంటింజెన్సీ చెల్లిస్తారు.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 19
పరీక్ష తేదీ: జూన్ 9
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం: హైదరాబాద్
వెబ్‌సైట్: http://aiishmysore.in

తాజా ఇంటర్న్‌షిప్‌లు

హైదరాబాద్‌లో

ది అఫర్డబుల్ ఆర్గానిక్ స్టోర్‌లో..

1. వేర్‌హౌస్ ఆపరేషన్స్
స్టైపెండ్: నెలకు రూ.8,000-12,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 4
కావలసిన నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, హిందీ, తెలుగు మాట్లాడటం, ఎంఎస్-ఆఫీస్
internshala.com/i/38eb1e

2. మేనేజ్‌మెంట్ ట్రెయినీ
స్టైపెండ్: నెలకు రూ.12,000
దరఖాస్తు గడువు: మార్చి 30
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్ మార్కెటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-ఆఫీస్
internshala.com/i/3403e0

రిజల్ సంస్థలో...

1. బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 3
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, లీడ్ జనరేషన్, సేల్స్, సేల్స్ పిచ్
internshala.com/i/d4d5df

2. మార్కెటింగ్
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 3
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, మార్కెటింగ్
internshala.com/i/5b08d4

3. వీడియో ఎడిటింగ్/ మేకింగ్
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: మార్చి 29
నైపుణ్యాలు: అడోబ్ క్రియేటివ్ సూట్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయటం, వీడియో మేకింగ్
internshala.com/i/f8c688

ఫీల్డ్ సేల్స్
సంస్థ: ఏకలవ్య
ప్రదేశం: హైదరాబాద్, గోదావరి జిల్లాలు
స్టైపెండ్: వారానికి రూ.700
దరఖాస్తు గడువు: మార్చి 30
నైపుణ్యాలు: సీఆర్ఎం, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయటం, సేల్స్
internshala.com/i/3a9690

టాలెంట్ అక్విజిషన్
సంస్థ: ఐడీటీ జెమలాజికల్ ల్యాబొరేటరీస్
స్టైపెండ్: నెలకు రూ.8,000
దరఖాస్తు గడువు: ఏప్రిల్ 2
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, నెగోషియేషన్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్
internshala.com/i/7cf285

మోడల్ పేపర్లు 2024
Final Exams
ఈనాడు
ప్రతిభ
E